

నేడు విద్యాశాఖాధికారులతో జెడ్‌పి చైర్‌పర్సన్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల విద్యా శాఖాధికారులతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ అధికార యంత్రాంగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఏలూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మూడు జిల్లాల విద్యా శాఖాధికారులు, తొమ్మిది మంది ఉప విద్యాశాఖాధికారులు, 48 మంది ఎంఇఒలు పాల్గొననున్నారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యా శాఖ పనితీరు, ఉపాధ్యాయుల విధి నిర్వహణ, పాఠశాలల్లో మౌలిక వసతులు, రానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంసిద్ధత ఏర్పాట్లు, తదితర అంశాలపై విద్యాశాఖాదికారులతో చైర్‌పర్సన్ సమీక్షించానున్నారని పేర్కొన్నారు.

పునరావాసంపై.. ప్రణాళిక లేదాయే..!

పోలవరం ప్రాజెక్టు పనులపై అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

డయాఫ్రంవాల్, గ్యాప్-1,2, ఇతర ప్రాజెక్టు పనులపై తేదీలతో సహా ప్రణాళిక

2026 అక్టోబర్‌కు ప్రాజెక్టు పూర్తిచేస్తామని ప్రకటన

నిర్వాసితుల పునరావాసంపై మాత్రం ప్రణాళిక నిల్

మీడియాపై సవాలక్ష ఆంక్షలు



పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు, ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పనుల పూర్తిపై తేదీలతో సహా ప్రణాళిక ప్రకటించిన సిఎం చంద్రబాబు, ప్రాజెక్టులో అత్యంత కీలకమైన నిర్వాసితుల పునరావాస పరిహారంపై ఎటువంటి ప్రణాళిక ప్రకటించకుండా, ముక్తసరిగా మాట్లాడి తన పర్యటన ముగించిన పరిస్థితి నెలకొంది. సిఎం పర్యటనతో తమకు భరోసా దొరుకుతుందని ఆశించిన నిర్వాసిత కుటుంబాలకు మరోసారి నిరాశ మిగిలింది. ప్రాజెక్టు పనులపై సిఎం ప్రకటించిన ప్రణాళికను పరిశీలిస్తే అందులో నిర్వాసితులకు సంబంధించి ఒక్క అంశం కూడా లేదు. సోమవారం సిఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. ఉదయం 10.45 గంటలకు రావాల్సిన సిఎం దాదాపు గంట ఆలస్యంగా 11.50 గంటలకు చేరుకున్నారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే తర్వాత, కొండపైన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద దిగారు. సిఎంకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. ముందుగా కొండపైన ఉన్న వ్యూపాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గం గుండా ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. డయాఫ్రంవాల్, గ్యాప్ - 1, 2 పనులతో పాటు ఇతర పనులను సిఎం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్ పాయింట్ల ద్వారా సిఎంకు పనుల ప్రగతి గురించి ఇరిగేషన్ అధికారులు వివరించారు. దాదాపు గంటన్నరపాటు ప్రాజెక్టు పనులను సిఎం పరిశీలన చేశారు. అక్కడ నుంచి కొండపైన ఉన్న సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, అధికారులతో సమావేశమైన సుదీర్ఘంగా చర్చించి పనులు ప్రగతిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో సిఎం మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళున్నట్లు తెలిపారు. డయాఫ్రమ్ వాల్, ఇసిఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టొచ్చని నిపుణులు సూచించారన్నారు. కొత్త డయాఫ్రమ్ వాల్ పనులను జనవరి రెండో తేదీన చేపట్టనున్నట్లు తెలిపారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు 2026, మార్చి నెలకు నాటికి పూర్తిచేస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారని, 2025, డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఇసిఆర్‌ఎఫ్, గ్యాప్ - 1 పనులు 2026 ఫిబ్రవరి నాటికి, గ్యాప్- 2 పనులు 2027 డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు. ఇంకా ముందుగానే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరుతూ లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రాజెక్ట్ సివిల్ పనులను 2026 మే, జూన్ నాటికి పూర్తి చేస్తే ఒక సీజన్‌ను కోల్పోకుండా ఉంటామని, 2026 నుండి ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను కోరామన్నారు. ప్రాజెక్ట్ కుడికాల్వ, ఎడమ కాల్వ కనెక్టివిటీ పనులు 2026, జూన్ లోగా, స్పిల్ ఛానల్ పనులు 2026, జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు. మొదటి దశలో 41.15 లెవెల్ నిర్మాణానికి రూ.12,157 కోట్లు సాధించామన్నారు. వాటిలో రూ.2,345 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేసిందన్నారు.



సిఎం చంద్రబాబుకు మొక్క అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



సిఎంకు శాలువా వేస్తున్న మంత్రి పార్థసారథి

పునరావాసంపై చర్చ లేదు.. ప్రణాళిక లేదాయే..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 96.600 కుటుంబాలను తరలించాలని ప్రభుత్వ తేల్చింది. ఇప్పటి వరకూ 12,797 కుటుంబాలను మాత్రమే తరలించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 41.15 మొదటి దశకు సంబంధించి వెంటనే తరలించాల్సిన కుటుంబాలు రెండు జిల్లాల్లో ఇంకా 25,263 ఉన్నాయి. ఇప్పటి వరకూ 13.01 శాతం మాత్రమే పునరావాసం కల్పించిన పరిస్థితి ఉంది. మొదటి దశకు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం రూ.12,157 కోట్లు ఇచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. సోమవారం సిఎం చెబుతున్న మాటల ప్రకారం ఈ సొమ్ములతోనే తొలిదశ పునరావాసం, ప్రాజెక్టు పనులు చేయాల్సి ఉంది. అలాంటప్పుడు ప్రాజెక్టు పనులపై తేదీల వారీగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపిన సిఎం పునరవాసం ఏవిధంగా అమలు చేస్తారో ఒక్కమాట కూడా చెప్పలేదు. 2026కు పునరావాసం పూర్తి చేస్తామంటూ ముక్తసరిగా ఒక్కమాట చెప్పి వదిలేసిన పరిస్థితి నెలకొంది. సిఎం పర్యటనతో తమకు భరోసా దొరుకుతుందని ఆశించిన నిర్వాసితులకు మరోసారి నిరాశే మిగిలింది. ముఖ్యమంత్రి పర్యటనలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, శాసనసభ్యులు చిర్రి బాలరాజు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, కొలికపూడి శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిఎం పర్యటనలకు సవాలక్ష ఆంక్షలు పెట్టి జర్నలిస్టులను తీవ్ర ఇబ్బందులు పెట్టిన పరిస్థితి కొనసాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం అదే ఒరవడి కొనసాగుతున్న పరిస్థితి.



పనులపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

పోలవరం ప్రాంతంలోని సమస్యలు పరిష్కరించండి..

సిఎంకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వినతి

పోలవరం నియోజకవర్గంలో నెలకున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వినతిపత్రం అందించారు. ఏజెన్సీ ప్రాంతంలోని వేలేరుపాడులో మరో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుచేయాలని, తరచూ వరద ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్న వేలేరుపాడు మండలం కమ్మరిగూడెంలోని 220 కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అశ్వారావుపేట మండలం కుందవల్లి గ్రామం వద్ద పెదవాగు ప్రాజెక్టును రెండు రాష్ట్రాల సమ్మిళిత ప్రాజెక్టుగా చేపట్టేందుకు తెలంగాణ రాష్ట్ర అధికారులతో చర్చించడానికి వీలుగా నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ కోరారు. పోలవరం మండలం టేకూరు ఆర్‌అండ్‌ఆర్ సమస్యలు, దేవరగొందిలో (ప్రగడవల్లి) ప్యాకేజీలో విడుదల చేయాల్సిన మిగిలిన సొమ్ము, 2015లో 1,787 కుటుంబాలకు అధికారులు ఇచ్చిన హామీల అమలు, 2016లో పోలవరం ప్రాజెక్ట్ కోసం ఖాళీ చేయబడిన ఏడు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని, పోలవరం పంచాయతీలోని పునరావాస గ్రామంలో 190 ఇళ్ల నిర్మించారని, మంజూరైన జాబితాలో 17 మంది పేర్లను చేర్చాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఎంపీ సిఎం దృష్టికి తీసుకెళ్లారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా.. దశలవారీ ఆందోళనలు

18న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు - సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా దశలవారీ ఆందోళనలు చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 18న జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లులు దహనం కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఏలూరు పవరుపేటలోని ఉద్దరాజు రామం భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజా సమస్యలపై రానున్న రోజుల్లో ఆందోళనలు, పోరాటాలు చేపట్టాలని సిపిఎం జిల్లా మహాసభలు పిలుపునిచ్చాయని వివరించారు. ఈ నెల 13, 14,15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరిగిన సిపిఎం జిల్లా మహాసభలు తీర్మానాలను, నూతన కమిటీ వివరాలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ట్రూఅప్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ ఛార్జీలు వడ్డిస్తున్నారని విమర్శించారు. అసలు కంటే కొసరే అధికంగా జనంపై భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్ పిపిసిఎ ఛార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయాలని ప్రకటించిన కూటమి నేతలు ఎన్నికల అనంతరం స్మార్ట్ మీటర్ల బిగింపునకు ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపితే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. విద్యుత్ భారాలను ఉపసంహరించకపోతే పెద్దఎత్తున ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అదానితో సెకి చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ ముడుపులతో కూడిన ఒప్పందాలని తేలినందున వాటిని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. అదానితో జరిగిన విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలపై అదనంగా లక్ష కోట్ల రూపాయల భారాలు మోపడానికి సిద్ధపడడం దారుణమన్నారు. అదానితో చేసుకున్న ఒప్పందాలు అన్నింటినీ రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లాలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటి ఆధారంగా జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం దశల వారీ ఉద్యమం చేపడుతుందని, ఈ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిండా మునిగిపోతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు దృష్టి సారించాలని కోరారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులవుతున్న ప్రజల సమస్యలు పరిష్కరించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సిపిఎం వ్యతిరేకం కాదని, అయితే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం, పునరావాసం సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఇళ్ల స్థలాలు, భూములు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం తక్షణం పూర్తిచేసి మెట్ట ప్రాంత భూములకు సాగునీరందించాలని కోరారు. జిల్లా మహాసభల్లో ప్రజా సమస్యలపై 30 తీర్మానాలు ఆమోదించినట్లు ప్రకటించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, గిరిజనులు, దళితులు, మహిళలు, యువజనులు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో నూతన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో జరిగిన సిపిఎం జిల్లా 26వ మహాసభలో సిపిఎం ఏలూరు జిల్లా నూతన కార్యదర్శిగా మరలా ఎ.రవి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ ఎన్నికయ్యారు. మరో 16 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు రవి తెలిపారు.

లోక్ అదాలత్‌లో 5,616 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జిల్లా వ్యాప్తంగా 33 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, 5,616 కేసులు పరిష్కరించడం జరిగిందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీటిలో 5,259 క్రిమినల్ కేసులు, 170 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 187 సివిల్ కేసులు రాజీచేసినట్లు తెలిపారు. వీటితోపాటు 87 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు తలెఇపారు. వీటిలో ఏలూరు 1197, భీమవరం 601, చింతలపూడి 295, జంగారెడ్డిగూడెం 526, కొవ్వూరు 297, నరసాపురం 434, పాలకొల్లు 213, తాడేపల్లిగూడెం 756, తణుకు 617, నిడదవోలు 602, భీమడోలు 78 కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించామని తెలిపారు. కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్‌ఎన్‌ఎల్ వారికి, జిల్లా పంచాయతీ శాఖ వారికి, ఇతర అధికారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ గ్రామంలోని ధాన్యం కల్లాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులతో ముఖాముఖిగా సంభాషించారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలవరం ఆర్‌ఎస్‌కె నుంచి ప్రతి ఒక్క రైతు కూడా ప్రభుత్వానికి ధాన్యం అమ్మేలాగా చర్యలు తీసుకున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రుసుము చెల్లించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం, రైతులకు అండగా ఉండే ప్రభుత్వమని చెప్పారు. ఆయనతో పాటు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఉన్నారు.

జిల్లాలో 132 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

అక్కడికక్కడే 196 అర్జీల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. ఏలూరు జిల్లాలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మీ భూమి... మీ హక్కు పేరుతో శుక్రవారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జెసి వివరాలు తెలిపారు. జిల్లాలో 28 మండలాల్లో మొత్తం 665 రెవెన్యూ గ్రామాలుండగా ఇప్పటివరకు 132 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు.

సోమవారం నిర్వహించిన 31 రెవెన్యూ సదస్సుల్లో 824 మంది పాల్గొని ఆయా సమస్యలపై 326 అర్జీలను అందించారని, వాటిలో 15 దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించామని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన విజ్ఞప్తులను 45 రోజులోగ్గా పరిష్కరించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన 132 గ్రామ రెవెన్యూ సదస్సులకు 6558 మందీ హాజరై 1613 అర్జీలు ఇవ్వగా వాటిలో అక్కడికక్కడే 196 అర్జీలు పరిష్కరించినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి మండలానికి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాఅధికారిగా నియమించినట్లు చెప్పారు. జనవరి ఎనిమిదో తేదీ వరకు ఆయా గ్రామల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు పాల్గొని తమ భూములకు సంబంధించిన సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలని తెలిపారు.

రాష్ట్రస్థాయిలో శ్రీనివాసరాజు ప్రతిభ

అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మూడు స్వర్ణ పతకాలు కైవసం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలో ఎం.శ్రీనివాసరాజు మంచి ప్రతిభను కనబరిచారు. గుడివాడ ఎన్‌టిఆర్ స్టేడియంలో 44వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 45 ప్లస్ పురుషుల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఎం.శ్రీనివాసరాజు మూడు స్వర్ణ పతకాలు సాధించారు. ముదినేపల్లి మండలంలోని చిగురుకోటలో సెంటినీ సిరామిక్ కంపెనీలో జూనియర్ మేనేజర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరాజు 44వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలో 500 మీటర్లు, 1500 మీటర్లు, ఐదు కిలోమీటర్ల 45 ప్లస్ పురుషుల విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ పతకాలను గుడివాడ ఎంఎల్‌ఎ వెనిగర్ల రాము చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా సెంటినీ సిరామిక్ కంపెనీ సిబ్బంది శ్రీనివాసరాజును అభినందించారు.



పతకాలతో శ్రీనివాసరాజు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

సిఎం చంద్రబాబుకు టిడిపి మండలాధ్యక్షులు అశోక్ వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సిఎం చంద్రబాబుకు టిడిపి మండలాధ్యక్షులు అమరవరం అశోక్ వినతిపత్రం అందించారు. పోలవరం ప్రాజెక్టు పర్యటనలో భాగంగా సోమవారం పోలవరం వచ్చిన సిఎం చంద్రబాబును ఆయన కలిసి వినతిపత్రం అందించి నిర్వాసితులు పడుతున్న కష్టాలను వివరించారు. ప్రధానంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, మిగులు భూమికి పరిహారం, 18 ఏళ్ల నిండిన యువతకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని, గత ప్రభుత్వంలో నిర్వాసితుల ఇళ్లకు పరిహారం విషయంలో జరిగిన నష్టం గురించి, జగన్నాథపురంలో ఆగిన 140 ఇళ్లు, రేపాకగొమ్ములో ఆగిన 37 ఇళ్లకు సంబంధించిన విషయం గురించి, పెద్దవాగు ప్రాజెక్టు వల్ల నష్టపోయిన ఇళ్లకు పరిహారం గురించి, ఆర్అండ్ఆర్ కాలనీ చల్లవారిగూడెంలో మౌలిక సదుపాయాల గురించి, కాలనీల్లో ఉన్న నిర్వాసితులకు పరిహారం విషయం గురించి, ముంపునకు సంబంధించిన గ్రామాలన్నిటిని ఒకే కాంటూరు 45.7 పరిధిలోకి తీసుకురావాలని, మండల ప్రజలు కరెంట్ లో వోల్టేజ్ సమస్య గురించి వివరించారు. ఈ విషయంపై సిఎం స్పందించి తప్పకుండా ఆదుకుంటామని, ప్రతి నిర్వాసితుడిని సంతృప్తి పరిచే విధంగా పరిహారం అందిస్తామని సిఎం అన్నారని మండఆధ్యక్షులు అశోక్ అన్నారు. సిఎం పాటు ఏలూరు ఎంపీ మహేష్ కుమార్, జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి పార్థసారథి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులును కలిసి వీరికి కూడా నిర్వాసితుల సమస్యలను వివరించినట్లు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో మండల ఉపాధ్యక్షులు కురుమేళ్ల సుధాకర్, ఎస్‌టి రాష్ట్ర కార్యదర్శి గొంది నాగేశ్వరరావు, కరటూరి రాధాకృష్ణ, చాపర్ల శ్రీను, అమరవరపు వెంకన్న, జాగర్లమూడి శ్రీకాంత్, నుపా శ్రీరాములు, కోటిపల్లి ముత్యాలరావు, రామకృష్ణ, రామారావు, రాంబాబు, పద్దం రమేష్, కుంజ విజయ్, లక్ష్మయ్య ఉన్నారు.



సిఎంకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మంత్రి నిమ్మలతో అశోక్

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

భీమడోలు : మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ నమోదు, నవీకరణ మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 17, 18వ తేదీల్లో గుండుగొలను-2, పూళ్ల-2, భీమడోలు ఇందిరా కాలనీ, అంగన్వాడీ కేంద్రాలు ఆధార్ నమోదు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. ఈ నెల 19, 20వ తేదీల్లో ఆగడాల లంక మెయిన్, ఎంఎం.పురం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు నమోదు కేంద్రాలుగా సేవలందిస్తాయన్నారు. ఇదేవిధంగా ఈ నెల 20వ తేదీన పొలసానిపల్లి-1 అంగన్వాడీ కేంద్రం ఆధార్ నమోదు కేంద్రంగా పనిచేస్తాయని తెలిపారు.


స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడేలా, ఉత్తమ ఫలితాలు, ఉత్తమ మార్కులు సాధించేలా యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ రూపొందించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా అలీ, రుద్రాక్షి రవి కుమార్, ఆర్థిక కార్యదర్శి రంగామోహన్, ఏలూరు నగర నాయకులు మరుమూడి చిట్టి బాబు, ఎమ్.డి.జక్రియా, తదితరులు పాల్గొన్నారు.

పాలసానిపల్లిలో అన్నసమారాధన

ప్రజాశక్తి - భీమడోలు

పాలసానిపల్లి గ్రామ ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోరుతూ సర్పంచి దంపతులు షేక్ రహీమా బేగం హసేన, పారిశ్రామికవేత్త షేక్ హసేన దంపతులు నాగేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ముగిసిన సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వేలాదిగా గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను కమిటీ సభ్యులు కోట శ్రీనివాసరావు, కోట శంకరం, కోట దుర్గారావు పర్యవేక్షించారు.

మండల మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల మహిళా సమాఖ్య నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గోళ్ల శాంతకుమారి(ఈదర), కార్యదర్శిగా సయ్యద్ బషీర్(ఆగిరిపల్లి) ఎన్నిక య్యారు. ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కోట శిరీష అధ్యక్షత న నూతన కమిటీ ఎన్నికలు సోమ వారం నిర్వ హించారు. ఈ కమిటీలో కోశా


మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం

ధికారిగా పాముర్తి శివ రేవతి(తోటపల్లి), ఉపాధ్యక్షురాలిగా సుంకర కరుణ కుమారి(ఆగిరిపల్లి), సహాయ కార్యదర్శిగా బొద్దు ప్రవల్లిక(ఈదులగూడెం)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 43 వివఒ అధ్యక్షులు, వివఒలు, ప్రేరణ మేనేజర్ ఎం.గోపి, సిసిలు దివ్య, హుస్సేన్ బి.లక్ష్మి, రజిత, రాంబాబు పాల్గొన్నారు. నూతన కమిటీని టిడిపి నాయకులు పిట్టిని శివరామకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు, దొండపాటి ఏసుపాదం, ఎపిఎం దయాల రాజశేఖర్ అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో మాజీ ఎంఎల్ఎ డిఎన్ఆర్ దంపతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి కళ్యాణ మహోత్సవాలు సోమవారంతో 11వ రోజుకు చేరాయి. ఉత్సవాలు చివరి దశకు చేరుకోవడంతో యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు ప్రముఖులు పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దంపతులు పుట్టలో పాలు పోసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డిఎన్ఆర్ దంపతులకు ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి స్వామి వారి ఫోటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, షష్టి ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, వి.సురేష్, ఎన్.శివరమేష్, పి.కృష్ణ, బి.సోమమ్మ, కె.సుబ్బలక్ష్మి, డి.నాగలక్ష్మి, బిఎన్‌వి.రాధాకృష్ణ, పి.రమేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా నాగముని

ప్రజాశక్తి - మండవల్లి

కైకలూరు నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం నూతన అధ్యక్షులుగా మామిడి శెట్టి నాగముని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షులు కోడి దుర్గారావు స్పష్టం చేశారు. మండలంలోని చావలిపాడు దత్తాత్రేయలో సోమవారం నిర్వహించిన కైకలూరు నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నికల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శెట్టిబలిజ సంఘం మరింత అభివృద్ధి కాంక్షిస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా మామిడిశెట్టి నాగ ముని, గౌరవ అధ్యక్షులుగా కడలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పిచ్చెట్టి శ్యామలరావు, కాంద్రేగుల నాగరాజు, జనరల్ సెక్రటరీగా బొంతు చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా వీరవల్లి వీరస్వామి, ట్రెజరర్‌గా జోగి కుమార్‌తో పాటు ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మామిడి శెట్టి నాగ ముని మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గ శెట్టిబలిజ కమిటీని ఏలూరు జిల్లాలోనే ఆదర్శవంతమైన కమిటీగా తీర్చిదిద్దుతానన్నారు. శెట్టిబలిజ సంఘం అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తానన్నాకరు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవి అందించిన శెట్టిబలిజ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నూజివీడు ఎంఆర్.అప్పారావు కాలనీలోని సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు, మానికల నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను పెంచుతూ ప్రజలపై మోయలేని భారం వేసిన రూ.18 వేల కోట్లను ఉపసంహరించుకోవాలని, కుటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు కలిగించే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, బడుగు బలహీన తరగతులకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెంకు రమేష్, అమ్ములు, అరుసువల్లి దేవుడు, కర్రి నాగరాజు, బోను సాయి, గుంట తిరుపతి, సన్నీ, రాజు, గౌరీ నాయుడు, రాజి, నాగమణి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు పట్టాలు దాటుతున్న ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌ను రైలు ఢీకొనడంతో ఆయన మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గొల్లగూడెం ప్రాంతానికి చెందిన రామేశ్వరపు మధుబాబు (41) స్థానికంగా భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ప్రస్తుతం అతను కాకినాడ మూడో బెటాలియన్ ఎపిఎస్‌పి విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం సెలవుపై కాకినాడ నుంచి గొల్లయిగూడెం వచ్చాడు. అనంతరం ఇంటి నుంచి కాకినాడ బెటాలియన్‌కు బయలుదేరి వెళ్తూ ఏలూరు నగరంలోని చైతన్య కళాశాల వద్ద రైలు పట్టాలను దాటుతున్న సమయంలో కాకినాడ నుంచి తిరుపతి వెళ్తున్న రైలు అతడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించారు.

కళాశాలకు కంప్యూటర్ డెస్క్‌లు బహూకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు పట్టణంలో ప్రముఖ డాక్టర్, ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిపిడిసి సభ్యులు డాక్టర్ డి.సుబ్బారావు, లయన్స్ జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ డి.సరస్వతి దంపతుల కుమారుడు సూర్య సాకేత్ ఫేస్‌బుక్ సంస్థలో ఉద్యోగంలో చేరిన సందర్భంగా సోమవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం 15 కంప్యూటర్ డెస్క్‌లను బహుకరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ డి.సుబ్బారావు దంపతులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబులు పొట్టి శ్రీ రాములు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి ఛాలెంజర్స్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.పోలేశ్వరరావు, సెక్రటరీ డాక్టర్ కె.రాంప్రసీన్, కళాశాల సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా నగేష్‌బాబు

ప్రజాశక్తి - మండవల్లి

గుణదల ఇఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా మండవల్లికి చెందిన దొడ్డకుల నగేష్‌బాబు ఎన్నికైనట్లు హాస్పిటల్ బోర్డ్ ఛైర్మన్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగేష్ బాబు చైతన్య విద్యాసంస్థలకు కార్మిక చట్టాల విభాగం అసిస్టెంట్ మేనేజర్‌గా గత గడచిన 13 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వేలాదిమంది ఇఎస్ఐ కార్మికులకు వైద్యరీత్యా ఇఎస్ఐ నుంచి కార్మికులకు వచ్చే వివిధ ప్రయోజనాలను అందిస్తూ ఆరోగ్య అవగాహనా సదస్సులను ఎన్నో విధిగా నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. దీంతో ఆయన కార్మికుల పక్షపాతిగా పేరుగాంచారన్నారు. ఈ సందర్భంగా నగేష్ నగేష్‌బాబును ఇఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్‌గా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నగేష్‌బాబు మాట్లాడుతూ విజయవాడ గుణదల ఇఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానన్నారు. కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఏలూరులోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కలపర్తి సాయి పవన్‌కుమార్ మొదటి బహుమతి సాధించాడు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పాటు ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి సాయి పవన్‌ను మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి, ఉపాధ్యాయులు అశోక్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

నేడు, రేపు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 17, 18 తేదీల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ (లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)పై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సదరు శిక్షణా కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరవ్వాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

పేదలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని సిపిఎం నాయకులు చెప్పారు. భూ వివాదం విషయంలో వ్యక్తి దాడిలో మహిళ గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధిత కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు, మండల కమిటీ సభ్యులు కుక్కిరిగడ్డ కుటుంబరావు, కంచర్ల రమేష్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి బంధువులు మాట్లాడుతూ డేరంగుల గంగయ్య, స్రవంతి దంపతులు మండలంలోని చింతలవల్లిలోని వాగు పోరంబోకు భూమిలో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో ఆ ఇంటి వెనుక భాగంలో ఉన్న ఏనుగుదాటి నాగరాజు ఆ భూమి తనదేనంటూ, అక్కడి నుంచి ఖాళీ చేయాలని స్రవంతితో చెప్పాడని, దీనికి ఆమె ఇప్పటికప్పుడు ఎక్కడికి వెళ్తామని చెప్పడంతో భూమి ఖాళీ చేయాల్సిందేనని ఆమెపై దాడి


స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

చేశాడని తెలిపారు. ఈ దాడిలో గాయాలపాలైన ఆమె నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుందన్నారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి, పేదలకు అండగా ఉంటామని చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలోని మెటలర్జీ ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ విద్యార్థులు నీలపు శ్రీవాణి, ఎన్.క్రాంతికుమారి, కె.హేమలత, కె.మమతాంజలి, వై.మంజుల మద్రాసుకు చెందిన కెసిపి ఇంజినీర్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులందరినీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ అభినందించారు. నేటి విద్యార్థులందరూ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపే పరిమితమవ్వడం కాకుండా, కోర్ ఇంజినీరింగ్ బ్రాంచిల్లో కూడా మెరుగైన అవకాశాలున్నాయని తెలుసుకోవాలన్నారు. గత కొన్నేళ్లుగా మెటలర్జీ విభాగ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి, ఉద్యోగాలను అందిపుచ్చుకుంటున్నారని డైరెక్టర్ తెలిపారు. ఈ ఏడాది వంద శాతం ఉద్యోగాల కల్పనతో మెటలర్జీ విభాగం విద్యార్థులు ముందంజలో ఉందని తెలిపారు. దేశానికి మెటలర్జీ విభాగంలో ఉదోగార్థుల కొరత ఉందని, ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా నూజివీడు మెటలర్జీ విభాగ విద్యార్థులు రాణించి, అవకాశాలను అందిపుచ్చుకుని స్థిరపడ్డారని తెలిపారు. మెటలర్జీ విభాగం ప్రొఫెసర్లు వీరశ్రీను, శివకుమార్, అసోసియేట్ డీన్ జ్యోతిలాల్, మధుసూదన్ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు అన్ని రకాలు సౌకర్యాలు

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు మేఘలాదేవి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. మండలంలో అంకాలగూడెంలో ఉన్న చైల్డ్ గైడెన్స్ సెంటర్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేఘాలాదేవి వికలాంగ విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల బొమ్మలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగ విద్యార్థులకు అన్నివిధాలా సకల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకోవాలని చెప్పారు. చదువుల్లో, ఆటల్లో, పాటల్లో తమ సత్తా చూపించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలు సూచనలను ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ గైడెన్స్ సెంటర్ ఉపాధ్యాయులు, కొత్త రమ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - చింతలపూడి

పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక, భారత స్వాతంత్ర్య సమరయోధులు, గాంధేయవాది, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి నిలువెత్తు స్ఫూర్తి అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అధ్యక్షతన పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ డే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 1901లో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా, మద్రాస్ ప్రెసిడెన్సీ పరిధిలో జన్మించిన శ్రీరాములు సర్వోదయం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారన్నారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను అర్పించి, దేశ చరిత్రలో అమరులుగా నిలిచారన్నారు. చిన్ననాటి నుంచే కష్టాలు అనుభవించి ఇంజినీరింగ్ చదివినప్పటికీ, ఆయన దేశసేవే ముఖ్యమని భావించారని, మహాత్మ గాంధీ ఆశయాలకు ఆకర్షితుడై స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. గాంధేయ సిద్ధాంతాలను అనుసరించి, అహింస, సత్యాగ్రహం మార్గాల్లో పయనించారన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ అణగారిన తరగతుల అభ్యున్నతికి పాటుపడ్డారని, దళితుల కోసం సేవ చేశారని తెలిపారు. బ్రహ్మచర్యం, సాదా జీవితం, ఆదర్శాలను పాటిస్తూ తన వ్యక్తిత్వాన్ని మలుచుకున్నారన్నారు. చరిత్ర అధ్యాపకులు డాక్టర్ సంతోష్‌రావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 1952లో ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం గాంధేయ మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు కె.హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 1952 అక్టోబర్ 19న చెన్నైలో నిరాహార దీక్ష ప్రారంభించి 58 రోజులపాటు ఆహారం తీసుకోకుండానే ఆయన దీక్ష కొనసాగించిన సమయంలో అనేక మంది ప్రజలు ఆయనకు మద్దతుగా నిలిచారన్నారు. ఆయన త్యాగం చూసి ప్రభుత్వంపై తెలుగు ప్రజలు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. డిసెంబరు 15, 1952న ఆయన ప్రాణాలు కోల్పోయారని, శ్రీరాములు త్యాగం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిందని అన్నారు. ఆయన మృతితో తెలుగు ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారని, ఈ ప్రజా పోరాటానికి ఫలితంగా 1953లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ కోరారు. మండలంలోని వాడవల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో పి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ గ్రామ రెవెన్యూ సదస్సులో 47 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చినట్లు తహశీల్దార్ జెఎస్.సుభాని తెలిపారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచి సుధాబత్తుల లక్ష్మి పద్మావతి రమణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇఒ సింగనపల్లి శ్రీనివాసరావు, విఆర్ఒ ఫణి, రైతులు, విఆర్ఎలు పాల్గొన్నారు.

మండవల్లి: భూముల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదుకోండని రైతులు తహశీల్దార్ కె.గోపాల్‌ను వేడుకున్నారు. మండలంలోని పెరికేగూడెంలో సోమవారం తహశీల్దార్ కె.గోపాల్ అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎదురైన భూ


ముదినేపల్లిలో....

సంబంధిత సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోని భూములు సబ్ డివిజన్ కాకపోవడంతో ఎల్‌సి నెంబర్లు లేక రిజిస్ట్రేషన్లు అవడం లేదని ఆయనకు తెలిపారు. దీంతో తహశీల్దార్ కార్యాలయానికి రిజిస్టర్ కార్యాలయానికి కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తుందని ఆయన వద్ద వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందన్నారు. ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. రెవెన్యూ కార్యాలయానికి అర్జీ పెట్టుకుంటే సబ్ డివిజన్ చేసి త్వరితగతిన ఎల్‌సి నెంబర్లు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పెరుమళ్ల పద్మ, ఆర్ఐ శ్రావణి, నాయకులు ఎన్‌కె.రాంబాబు పాల్గొన్నారు.


భీమడోలులో...

చింతలపూడి : గ్రామాల్లో ఏమైనా రెవెన్యూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సుల పరిష్కారం పొందవచ్చని చింతలపూడి తహశీల్దార్ ప్రమద్వర అన్నారు. మండలంలోని లింగగూడెం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో చాలామంది రైతుల భూములు వారు మరణించిన తల్లిదండ్రుల పేరున ఉన్నాయన్నారు. సదరు భూములను వారసులైనవారు పట్టా జిరాక్స్ వాటాలు జోడితో కుటుంబ సభ్యుల ధ్రువపత్రం జతపరిచి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరవుతాయని తెలిపారు. అనంతరం ప్రభుత్వ పథకాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సరంచి పెనుబోయిన ప్రభావతి, ఉపసర్పంచి నత్త నరసింహారావు, కోడిపల్లి సత్యనారాయణ, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

భీమడోలు : భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రభుత్వం మీ భూమి-మీ హక్కు పేర నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల సేవలను వినియోగించుకోవాలని, రెవెన్యూ సదస్సుల భీమడోలు ప్రత్యేకాధికారి, బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆర్.నాగమణి కోరారు. అంబర్‌పేట గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి 15 వినతులు రాగా, వాటిలో నాలుగు వినతులను తక్షణమే పరిష్కరించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ధర్మారావు, గ్రామ రెవెన్యూ అధికారులు ప్రభాకరరావు, రాణి పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి ఆధ్వర్యాన ధర్నా, వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు మర్సకట్ల త్యాగరాజు, చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐటియుసి అనుబంధం ఆధ్వర్యంలో చాట్రాయి ఎంఇఒ వివిఎస్‌వి.బ్రహ్మాచారికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా త్యాగరాజు, పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని మెస్‌ఛార్జీల వల్ల పూట గడవని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మెనూను అమలు చేయడం ఎలా సాధ్యమవుతుందన్నారు. ఈ విషయం ప్రభుత్వం గమనించాలని, ప్రస్తుతం ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ.15, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.20 మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, పర్యవేక్షణ పేరుతో వంట కార్మికులపై ఒత్తిడి తీసుకురాకూడదని, మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, దీపం- 2 పథకం కింద ప్రభుత్వ పాఠశాలలకు గ్యాస్ సరఫరా చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మెడికల్, బీమా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్, మిడ్డేమిల్స్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ ఎం.వాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ పాఠశాలలో శానిటేషన్ కార్మికులకు ఓటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికీ ఆరు నెలలుగా వారికి జీతాలు చెల్లించకపోవడంతో అర్ధాకలితో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మిడ్ డే మీల్స్ కార్మికులకు గత ప్రభుత్వంలో రూ.మూడు వేలు గౌరవ వేతనంగా ఇచ్చారని, నేడు కూటమి ప్రభుత్వం రూ.వెయ్యి కటింగ్ పెట్టి కేవలం రూ.రెండు వేలు గౌరవ వేతనంగా చెల్లించడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు పెరిగడంతో ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న మెనూ ఛార్జీలు సరిపోక అప్పులు చేస పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. మిడ్ డే మిల్స్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు, గౌరవ వేతనం పెంచాల్సింది పోయి, వారికి ఇస్తున్న వేతనంలో కోత పెట్టడం దారుణమన్నారు. అకారణంగా తొలగించిన మిడ్ డే మీల్స్, శానిటేషన్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, శానిటేషన్ కార్మికులకు ఆరు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా స్కీమ్ వర్కర్లందరికీ నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.హరినాథ్, ఎఐటియుసి జిల్లా నాయకులు వేముల బక్కయ్య, పరికల కళావతి, బి.ఆనందరావు, బి.అరుణకుమారి, పి.విజయకుమారి, బి.సీతామహాలక్ష్మి, టి.కృష్ణవేణి, షేక్ గౌసియా పాల్గొన్నారు.


పిల్లలతో మాట్లాడుతున్న పోలీసులు

పోలీసుల దాతృత్వం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తల్లిదండ్రులు లేని ముగ్గురు ఆడ పిల్లలను చదివేందుకు పోలీసులు ఉదార హృదయంతో ముందుకు వచ్చారు. మూడు రోజుల క్రితం ఏలూరు నగరానికి చెందిన ఆటో డ్రైవర్ కనకరాజు రామకృష్ణాపురం రైల్వే వంతెన కింద హత్యకు గురయ్యాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పదేళ్ల క్రితం కనకరాజు భార్య మృతి చెందింది. అప్పటినుంచి పిల్లలను అన్నీ తానే చూసుకుంటున్నాడు. వీరిలో పెద్ద కుమార్తెను తనకు ఇచ్చి వివాహం చేయాలని నాని అనే యువకుడు కనకరాజుపై ఒత్తిడి తెచ్చాడు. అందుకు కనకరాజు నిరాకరించడంతో కనకరాజును హత్య చేశాడు. దీంతో ముగ్గురు ఆడపిల్లలు పూర్తిగా అనాధలయ్యారు. ప్రస్తుతం మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు ఈ ముగ్గురిని వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించి సంరక్షిస్తున్నారు. అనాధలైన ఈ ముగ్గురు ఆడపిల్లల చదువు బాధ్యతలను తాను నిర్వహిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. నగర ప్రజలు మూడో పట్టణ శాఖకు అభినందనలు తెలిపారు.